కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్


వెరుబొట్లపల్లిలో అక్రమంగా నిర్మిస్తున్న భవనం

- వెరుబొట్లపల్లిలో అక్రమ భవన నిర్మాణం
- కూల్చివేయాలని ఇరిగేషన్ అధికారి నివేదిక
- పట్టించుకోని రెవెన్యూ యంత్రాంగం

కలువాయి(సైదాపురం): మండలంలోని వెరుబట్లపల్లి చెక్ డ్యామ్‌లో అక్రమంగా నిర్మిస్తున్న భవన నిర్మాణంపై పత్రికల్లో వచ్చిన వరుస కథనాలకు స్పందించిన జిల్లా కలెక్టర్ ఆనంద్ వెంటనే ఇరిగేషన్ అధికారులు వెళ్లి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అందులో భాగంగా జూలై 30న ఇరిగేషన్ ఏఈఈ హరికృష్ణ, రెవెన్యూ అధికారులు కలసి పర్యటించారు. సర్వే నెంబర్ 850లో దాదాపు 200 అంకణాల విస్తీర్ణంలో భవనాన్ని అక్రమంగా వాగు పోరంబోకు భూమిలో నిర్మిస్తున్నట్లు నిర్ధారించారు. దాన్ని కూల్చివేయాలంటూ ఇరిగేషన్ ఏఈఈ హరికృష్ణ రెవెన్యూ అధికారులకు, పంచాయతీ కార్యదర్శికి నివేదిక ఇచ్చారు. అయితే స్థానిక రెవెన్యూ అధికారులు కాసులు దండుకుని, అక్రమ నిర్మాణానికి వత్తాసు పలుకుతున్నారని స్థానికులు చెబుతున్నారు. ఇరిగేషన్ అధికారి ప్రభుత్వ వాగు పొరంబోకు భూమిలో చేపట్టిన నిర్మాణాన్ని కూల్చివేయండి అని చెప్పినా అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. ఏ స్థాయిలో డబ్బులు ముట్టాయోనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై సోమవారం కలెక్టరేట్‌కు వెళ్లి స్పందనలో ఫిర్యాదు చేయనున్నట్లు స్థానికులు తెలిపారు. మరోసారి కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవలసిన అవసరం ఉందని వారు కోరుతున్నారు.


అక్రమ నిర్మాణాన్ని అడ్డుకున్న రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు (ఫైల్)

క్లుప్తంగా

నానో యూరియాతో రైతులకు ఆదాయం


మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయధికారి ప్రసాద్

దొరవారిసత్రం : నానో యూరియా, నానో డీఏపీ రైతులు వినియోగించడం వల్ల రైతులకు ఆదాయం చేకూరుతుందని జిల్లా వ్యవసాయధికారి ప్రసాద్ తెలిపారు. స్థానిక వ్యవసాయాధికారులు నెలబల్లి గ్రామంలో శనివారం మండల స్థాయిలో రైతులకు నానో ఎరువులు, జీవ ఎరువులపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వ్యవసాయధికారి నానో యూరియా, నానో డీఏపీతోపాటు బయో ఫెర్టిలైజర్స్‌పై రైతులకు అవగాహన కల్పించారు. నానో యూరియా, నానో డీఏపీ సామర్థ్యం, ఉపయోగాల గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ ధనుంజయ్, కాంచన, ఏఓ జ్యోతిర్మయి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనులపై ఎంపీడీఓకు ఫిర్యాదు


ఎంపీడీఓకు విజ్ఞప్తి చేస్తున్న గ్రామస్తులు

సూళ్లూరుపేట రూరల్ : మండలంలోని మన్నేముత్తేరి పంచాయతీలో ఉన్న ఉలసాపడవ, చిన్న ఉలసాపడవ గ్రామాల ఉపాధి కూలీలు ఫీల్డ్ అసిస్టెంట్ల పనితీరుపై ఎంపీడీఓ మురళికి శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఫిర్యాదు అందజేశారు. ఉపాధి పనిదినాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా మహిళా ఫీల్డ్ అసిస్టెంట్లు ప్రైవేట్ కంపెనీలకు ఉద్యోగాలకు వెళుతున్నట్లు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వారి భర్తలు విధులకు హాజరై తమపై పెత్తనం చెలాయిస్తున్నట్లు ఆరోపించారు. మస్టర్ విషయంలో అవకతవకలకు పాల్పడుతున్నారని ఆయనకు తెలిపారు. అధికారులు చొరవ తీసుకుని సరైన ఫీల్డ్ అసిస్టెంట్లను ఏర్పాటు చేయాలని కోరారు.

నేడు అమ్మవారి ఆలయం మూసివేత


శ్రీచెంగాళమ్మ పరమేశ్వరి ఆలయం

సూళ్లూరుపేట : పట్టణంలోని శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయాన్ని ఆదివారం చంద్రగ్రహణం కారణంగా మధ్యాహ్నం 1 గంటల నుంచి సోమవారం ఉదయం 9 గంటల వరకూ మూసివేస్తున్నామని ఆలయ సహాయ కమిషనర్ అండ్ కార్యనిర్వహణాధికారి బీ ప్రసన్నలక్ష్మీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చంద్రగ్రహణం అనంతరం సోమవారం ఉదయం ఆలయాన్ని శుద్ధి చేసి సంప్రోక్షణ అనంతరం 9 గంటల తరువాత అమ్మవారి దర్శనభాగ్యం కల్పించనున్నట్లు తెలిపారు.

డిపో వద్ద రిలే దీక్షలు


నిరాహారదీక్షలు చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

సూళ్లూరుపేట : ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్న వీ పద్మ రూ.30 అవకతవకలకు పాల్పడిందని డిపో మేనేజర్ ఆమెను అక్రమంగా సస్పెండ్ చేసినందుకు నిరసనగా చేపట్టిన రిలే నిరాహారదీక్ష శనివారం 9వ రోజుకు చేరింది. నిరాహారదీక్షలు చేస్తుంటే అధికారులు పట్టించుకోవడం లేదని డిపోలోని నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు ఎం శేఖర్ ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీనియర్ ఎన్ఎంయూ నాయకులు పులి వెంకటేశ్వర్లు, ఎం శంకరయ్య, ఓ శ్రీనివాసులు, శశి, సునీల్, మూర్తి, జానకిరామయ్య, మాధయ్య, చిన్నయ్య, వేములు, రహీమ్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి అదృశ్యం


వీరమ్మ (ఫైల్)

కలువాయి(సైదాపురం): మండలంలోని పెన్నబద్వేల్ గ్రామానికి చెందిన మేక వీరమ్మ (78) ఈ నెల 4న ఇంటి వద్ద నుంచి వెళ్లి ఇంటికి తిరిగిరాలేదు. మేక హజరత్‌బాబు ఫిర్యాదు మేరకు కలువాయి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఆమె ఆచూకీ తెలిస్తే 9440700009కు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోటయ్య తెలిపారు.

చికెన్ ధరలు		07-09-2025
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు		
బ్రాయిలర్ లైవ్	:	115
లేయర్ లైవ్	:	123
బ్రాయిలర్ చికెన్	:	212
బ్రాయిలర్ స్కిన్ లెస్	:	234
లేయర్ చికెన్	:	210

కోనలో శ్రీవారికి ప్రత్యేక హోమాలు


స్వామి అమ్మవార్లను క్షేత్రోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

రాపూరు: మండలంలోని పెంచలకోన శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో జరుగుతున్న పవిత్రోత్సవాల్లో భాగంగా శనివారం వాసుదేవ కుండ హోమాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామి వారి అలంకార మండపంలో ఉదయం లక్ష్మీ నరసింహస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను శేషవాహనంపై కొలువుదీర్చారు. వివిధ రకాల పుష్పాలు, ఆభరణాలు, పవిత్రాలను అలంకరించి వేదపండితుల మంత్రోచ్ఛరణ మధ్య మంగళవాయిద్యాల నడుమ అత్యంత వైభవంగా పూజలు చేశారు. వేద దివ్య ప్రబంధ పారాయణం, హోమం, నివేదన, శాత్తుమొర నిర్వహించారు.

శ్రీవారికి క్షేత్రోత్సవం

పెంచలకోన పవిత్రోత్సవాల్లో భాగంగా సాయంత్రం శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను తిరుచ్చిపై కొలువుతీర్చి వివిధ పుష్పాలు, ఆభరణాలు అలంకరించి కోన మాడవీధుల్లో క్షేత్రోత్సవం నిర్వహించారు. స్వామి అమ్మవార్ల ఉత్సవాన్ని తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గ్రామస్తుల అభిప్రాయాలు తెలియజేయండి


మాట్లాడుతున్న సర్పంచ్ ఏడుకొండలు

చిల్లకూరు: జిందాల్ పరిశ్రమలకు కేటాయించిన భూముల్లో పనులు చేపట్టేందుకు గ్రామస్తులు అభిప్రాయాలను తెలియజేయాలని తహసీల్దార్ శ్రీనివాసులు మన్నెగుంట గ్రామస్తులకు సూచించారు. మండలంలోని మన్నెగుంట గ్రామంలో శనివారం పరిశ్రమ ప్రతినిధులు, ఏపీఐఐసీ, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా గ్రామసభ నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ పరిశ్రమ ప్రతినిధులు పనులు చేసేందుకు వెళ్లిన సమయంలో అడ్డుపడడం ద్వారా అభివృద్ధి ఆగిపోతుందని దీనికి సంబంధించి ఏవైనా అభ్యంతరాలు ఉంటే గ్రామస్తులు ఒక అభిప్రాయానికి రావాలని సూచించారు. దీంతో గ్రామ సర్పంచ్ ఏడుకొండలు మాట్లాడుతూ గ్రామం చుట్టూ పరిశ్రమలకు భూములు కేటాయించారని ఇందులో గ్రామం ఉన్న 58 ఎకరాలు కూడా కలిపి వేశారని అన్నారు. దీనిని వేరుచేసి రెవెన్యూ రికార్డుల్లో చూపాలని డిమాండ్ చేశారు. అనంతరం మరోసారి గ్రామస్తులు చర్చించుకుని అధికారులకు పూర్తి సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ గ్రామ సభలో ఆర్ఐ పూర్ణ, ఏపీఐఐసీ అధికారులు, పరిశ్రమ ప్రతినిదులు, పోలీసులు, పాల్గొన్నారు.

జీవన ఎరువులతో అధిక దిగుబడులు


మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి ప్రసాదరావు

నాయుడుపేటటౌన్ : రైతులు జీవన ఎరువులు వాడి అధిక దిగుబడులను పొందాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్ ప్రసాదరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల పరిధిలోని పలు గ్రామాల రైతులతో సమావేశమయ్యారు. రైతులకు నూతన వ్యవసాయ విధానాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా రైతులు రసాయన ఎరువులు అధికంగా వినియోగించడం వల్ల భూసారం తగ్గిపోతుందన్నారు. రైతులు ఎక్కువగా జీవన ఎరువులు తయారు చేసే విధానం తదితర విషయాలపై రైతులకు అవగాహన కల్పించారు. నాయుడుపేట డివిజన్ వ్యవసాయ సంచాలకులు ఎం నాగార్జున సాగర్, జిల్లా ఏడీఏ ధనుంజయ రెడ్డి, మండల వ్యవసాయాధికారి గణేష్ తదితరులు పాల్గొని పలు సూచనలు చేశారు.

భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు

వెంకటగిరి (సైదాపురం): వెంకటగిరిలో ఈ నెల 10,11 తేదీల్లో నిర్వహించనున్న శ్రీపోలేరమ్మతల్లి జాతరలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగుండా ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పేర్కొన్నారు. పట్టణంలోని పింజల వీరయ్య కల్యాణ మండపంలో పోలేరమ్మ తల్లి జాతర నిర్వహణపై శాంతికమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గతంలో జాతరలో జరిగిన పొరపాట్లను సరిచేసుకుంటూ సంప్రదాయాలను గౌరవిస్తూ జాతరను నిర్వహించాలని సూచించారు.

కమిటీపై ఆసక్తి చూపని స్థానికులు

గతంలో శాంతి కమిటీ సమావేశం జరిగినప్పుడు అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని తమ అభిప్రాయాలను తెలిపారు. అయితే శనివారం జరిగిన సమావేశంలో ప్రజలు పెద్దసంఖ్యలో హాజరు కాలేదు. కేవలం టీడీపీ, జనసేన శ్రేణులు, అధికారులు హాజరై తూతూమంత్రంగా సమావేశాన్ని ముగించారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆదాయం


మోడల్ చూపుతున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

చిల్లకూరు: మండలంలోని చిన్న, సన్న కారు రైతులు తమకు ఉన్న కొద్ది పాటి భూమిలో కూరగాయాలు ఆకు కూరలను ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా సాగు చేసి ఆదాయం పొందవచ్చని ప్రకృతి వ్యవసాయం కడివేడు ఇన్‌చార్జ్ పూర్ణిమ తెలిపారు. ఓడూరు గ్రామంలో శనివారం చిన్నకారు రైతులు ఆకు కూరలు సాగు చేసే విధానాన్ని చేసి చూపించారు. ఆమె మాట్లాడుతూ చిన్న, సన్నకారు రైతులు తమకు ఉన్న కొద్ది పాటి పొలంలో 25 రకాల విత్తనాలు నాటుకుని ఏడాది పాటుగా ఫలితం అనుభించేలా చూస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో డీఎంఎంటీ పెంచలయ్య, వీఏఏ గాయత్రి, లక్ష్మీ, సుకన్య పాల్గొన్నారు.

ట్రంప్ సుంకాలపై నిరసన


నిరసన తెలుపుతున్న వామపక్షాల నాయకులు

గూడూరురూరల్ : అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారతదేశంపై విధిస్తున్న సుంకాలను అందరూ వ్యతిరేకించాలని వామపక్ష నాయకులు పిలుపునిచ్చారు. గూడూరులోని టవర్‌క్లాక్ సెంటర్‌లో ఉన్న డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహం వద్ద శనివారం వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. సీపీఎం నాయకులు ఎంటేటి చంద్రయ్య, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రభాకర్ మాట్లాడుతూ భారతీయ సరుకుల దిగుమతులపై సుంకాన్ని 50 శాతానికి పెంచుతూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించడంతో దేశ ఉత్పత్తులపై తీవ్ర ప్రభావం పండిందన్నారు. ఈ కార్యక్రమంలో అడపాల ప్రసాద్, మణి, చంద్రయ్య, దారా కోటి, గుర్రం రమణయ్య, సీపీఐ నాయకులు శశికుమార్, రమేష్, సునీల్, మీరాభాయి, రాము, సీపీఐ(ఎం.ఎల్.) న్యూడెమోక్రసీ నాయకులు సునీల్ పాల్గొన్నారు

నాణ్యమైన భోజనం పెట్టాలి

కోట: విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని ఎంఈఓ మస్తానయ్య ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన శనివారం మండలంలోని కొక్కుపాడు జెడ్పీ హైస్కూల్, ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలసి భోజనం చేశారు. మెనూ తప్పనిసరిగా పాటించాలన్నారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. విద్యార్థులకు మంచినీటి సదుపాయం కల్పించాలన్నారు. హెచ్ఎం ప్రమీల పాల్గొన్నారు.

వీఆర్ఓలు బాధ్యతగా పనిచేయాలి

బాలాయపల్లి(సైదాపురం): రెవెన్యూ సమస్యలపై ప్రజలను కార్యాలయం చుట్టూ తిప్పుకోకుండా వీఆర్వోలు బాధ్యతగా పనిచేయాలని తహసీల్దార్ విజయలక్ష్మి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని కార్యాలయంలో శనివారం వీఆర్వోలతో సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రజల నుంచి ఇప్పటి వరకు వచ్చిన ప్రతి అర్జీకి పరిష్కారం చూపకపోతే నోటీసులు ఇస్తామని హెచ్చరించారు.

బాలికలు రాణించాలి

వెంకటగిరి రూరల్: బాలికలు విద్యతోపాటు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా రాణించాలని సీడీపీఓ శంషాద్‌బేగం పేర్కొన్నారు. పట్టణంలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో శనివారం మిషన్ శక్తి సంకల్ప కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాలికల విద్య, మహిళల పరిరక్షణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మి, ఏఎన్ఎం లక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు సుహాసిని, షహిద తదితరులు పాల్గొన్నారు.

దర్శనం మధ్యాహ్నం వరకే

చిల్లకూరు: చంద్ర గ్రహణం సందర్భంగా ఆదివారం ముత్యాలమ్మ దర్శనం మధ్యాహ్నం వరకు మాత్రమే ఉంటుందని ఆలయ ఈఓ నవీన్‌కుమార్ శనివారం తెలిపారు. చంద్రగ్రహణం సందర్భంగా ఆలయం మధ్యాహ్నం తరువాత మూసి వేయనున్నట్లు తెలిపారు.

కబ్జా అడ్డుకోవాలని వినతి

కలువాయి(సైదాపురం): మండలంలో దాచూరు మజారా గ్రామం ముక్కుతిప్ప వద్ద కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ భూములను కాపాడాలని తహసీల్దార్‌కు గ్రామస్తులు శనివారం వినతి పత్రం అందించారు. ముక్కుతిప్పలోని సర్వే నెంబర్ 989, 956లోని 56 ఎకరాల మేత పొరంబోకు భూములను కొందరు ఆక్రమించుకొని నిమ్మ, జామాయిల్ నాటి విద్యుత్ చౌర్యం చేస్తున్నారని ఆ అర్జీలో పేర్కొన్నారు. ఈ ఆక్రమణలను తొలగించి ప్రభుత్వ భూములను కాపాడాలని పేర్కొన్నారు.

బాల్యవివాహాలపై అవగాహన

గూడూరురూరల్ : బాల్య వివాహాల నియంత్రణపై విద్యార్థినులు తప్పనిసరిగా అవగాహన పెంచుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ మెహబూబి అన్నారు. గూడూరులోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం స్త్రీ- శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మిషన్ శక్తి కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఏసీడీపీఓ శారదాంబ, ఇన్‌చార్జి హెచ్.ఎం.మాధవిలక్ష్మి, సూపర్‌వైజర్లు స్వరూపరాణి, హైమావతి పాల్గొన్నారు.

ఆదిశంకర డీన్‌కు అవార్డు



గూడూరురూరల్ : ఆదిశంకర యూనివర్సిటీ డీన్ డాక్టర్ వేణుమాధవ్ ప్రతిష్టాత్మక అవార్డు 'విద్యార్థి ప్లేస్‌మెంట్, కెరీర్ అభివృద్ధిలో అద్భుత కృషి' అందుకున్నారు. ఈ గౌరవాన్ని సీఎస్‌సీ ఇండియా తరపున నేషనల్ టీచర్స్‌డే సందర్భంగా వేణుమాధవ్‌కు ప్రదానం చేశారు.

టిడ్కో గృహాల పరిశీలన

నాయుడుపేటటౌన్: మండల పరిధిలోని బిరదవాడ గ్రామ సమీపంలో జాతీయ రహదారి పక్కనే నిర్మించి ఉన్న టిడ్కో గృహాలను శనివారం సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రధాన మంత్రి అవాస్ యోజన, ఎన్టీఆర్ నగర్‌కు సంబంధించి గృహాలను లబ్ధిదారులకు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు.

అన్నదాత పోరును విజయవంతం చేద్దాం


అన్నదాతల పోరు పోస్టర్ల ఆవిష్కరణలో సంజీవయ్య తదితరులు

నాయుడుపేటటౌన్: కూటమి ప్రభుత్వం ఎరువులను సైతం బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తూ, రైతులకు మోసం చేస్తున్న తీరుపై ఈ నెల 9న జరిగే అన్నదాత పోరును విజయవంతం చేద్దామని సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పిలుపు నిచ్చారు. ఉమ్మడి నెల్లూరు జిల్లా కేంద్రంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం మాజీ మంత్రి కాకాణి సారథ్యంలో అన్నదాత పోరు పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ క్రమంలోనే ఈ నెల 9వ తేదీ నియోజకవర్గ కేంద్రంలో రైతులతో కలిసి ఆర్డీఓ కార్యాలయం వరకు పెద్ద ఎత్తున, ర్యాలీ చేపట్టనున్నట్లు సంజీవయ్య వెల్లడించారు.

కమిటీపై మిల్లర్ల అసంతృప్తి

తడ: వ్యవసాయ మార్కెటింగ్ కమిటీలో రైస్ మిల్లర్లకు సంబంధించి ఒక్కరికి కూడా స్థానం కల్పించకపోవడంపై మిల్లర్ల అసోసియేషన్ సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇటీవల సూళ్లూరుపేట వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ సభ్యులను ప్రభుత్వం నియమించింది. మండలంలోని కొండూరు పంచాయతీ, పులివేంద్ర గ్రామంలో ఉన్న ఏఎంసీ కార్యాలయంలో కమిటీ సభ్యులతో కలసి చైర్మన్ రమేష్ గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. దీనికి సంబంధించి శనివారం పరిచయ కార్యక్రమం పేరుతో కొందరిని ఏఎంసీ కార్యాయానికి పిలిపించడంతో విషయం తెలుసుకున్న మిల్లర్ల అసోసియేషన్ సభ్యులు కార్యాలయ కార్యదర్శి రామమ్మ ఎదుట తమ గోడు వెళ్లబోసుకున్నారు. తమలో ఒక్కరికి కూడా స్థానం కల్పించకుండా కమిటీ ఏర్పాటు చేయడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

రక్షణ కోరిన ప్రేమ జంట



చిల్లకూరు: ప్రేమ జంట పోలీసులను ఆశ్రయించిన సంఘటన శనివారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు మండలంలోని ఎగువరాజుపాళెం మర్ల మిట్టకు చెందిన మనోహర్, శ్రీకాళహస్తికి చెందిన నీరజ ప్రేమించుకున్నారు. విషయం తెలిసిన యువతి తల్లిదండ్రులు ఆమెను తీసుకెళ్లడానికి వచ్చారు. దీంతో ప్రేమ జంట తమకు రక్షణ కల్పించాలని పోలీసులను ఆశ్రయించింది. వారిద్దరూ మేజర్లు కావడంతో ఇరువురి కుటుంబ సభ్యులను పిలిపించిన పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి పంపించేశారు.

నేడు పోలేరమ్మ తల్లి ఘటోత్సవం


ప్రత్యేక పూజలు అందుకున్న ఘటం (ఫైల్)

వెంకటగిరి(సైదాపురం): ప్రసిద్ధి చెందిన వెంకటగిరి శక్తిస్వరూపిణి శ్రీ పోలేరమ్మతల్లి జాతర ఘటోత్సవం ఆదివారం నిర్వహించనున్నారు. ఈనెల 10, 11 తేదీల్లో నిర్వహించనున్న పోలేరమ్మతల్లి జాతరకు నేడు ఘటోత్సవ వేడుకలు ప్రారంభమవుతాయి. ఘటోత్సవంలో అమ్మవారికి బలిఇచ్చే దున్నపోతును, ఘటం(కుండ)ను అమ్మవారి మెట్టినిల్లు అయిన జీనుగుల వారి వీధిలోని మండపంలో కొలువుదీర్చిన అనంతరం పూజలు చేయనున్నారు. ఈ ఘటోత్సవం వెంకటగిరిరాజా ప్యాలెస్‌లో తొలి పూజ చేయడంతో ప్రారంభమవుతుంది. అనంతరం పట్టణంలోని ప్రతి ఇంటి ముంగిటకు ఘటం చేరుకుని ప్రత్యేక పూజలు అందుకుంటుంది.

మిషన్ శక్తి సంకల్పంతో అవగాహన


మిషన్ శక్తిపై అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ

చిల్లకూరు: మండలంలోని చిన్నారులు, కిశోర బాలికలకు ఐసీడీఎస్‌లో నూతనంగా ప్రవేశ పెట్టిన మిషన్ శక్తి సంకల్పతో అవగాహన కల్పించనున్నట్లు సీడీపీఓ మహబూబీ తెలిపారు. ఆమె మాట్లాడుతూ చిన్నారులు, కిశోర బాలికలపై ఇటీవల పలు రకాల దాడులు జరుగుతున్న క్రమంలో వారికి చెడు స్పర్శ, మంచి స్పర్శ, వారికి ఉన్న హక్కులు, స్వీయ సంరక్షణ లాంటి వాటిపై అవగాహన కల్పించేలా కార్యక్రమాలను చేపడుతున్నామని అన్నారు. కడివేడు ఉన్నత పాఠశాలలో శనివారం మిషన్ శక్తి సంకల్ప కార్యక్రమం నిర్వహించారు. ఏసీడీపీఓ శారదాంబ, సూపర్‌వైజర్ నాగిసెట్టి రేణుక, అంగన్‌వాడీ టీచర్లు సీహెచ్ సుగుణ, ఎం పద్మ, మహిళా ఉపాధ్యాయిని సుజీవన పాల్గొన్నారు.

13న జాతీయ లోక్ అదాలత్


మాట్లాడుతున్న న్యాయమూర్తి విష్ణువర్మ

వెంకటగిరి రూరల్: కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులను రాజీ కుదుర్చుకునేందుకు ఈ నెల 13న నేషనల్ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెంకటగిరి జూనియర్ సివిల్‌జడ్జి న్యాయమూర్తి విష్ణువర్మ సూచించారు. స్థానిక కోర్టులో బ్యాంకు అధికారులతో నేషనల్ లోక్ అదాలత్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొన్నారు.

అమెరికా సుంకాలను వ్యతిరేకించాలి

సూళ్లూరుపేట : భారతదేశ దిగుమతులపై అమెరికా విధిస్తున్న 50 శాతం సుంకాలను వ్యతిరేకించాలని వామపక్షాల ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి నాగేంద్రబాబు, సీపీఎం నాయకులు రియాజ్ మాట్లాడుతూ దిగుమతులపై అమెరికా విధిస్తున్న పన్నులు దుర్మార్గమని చెప్పారు. ట్రంప్ చేతిలో కీలుబొమ్మలా మారిన మన ప్రధాని మోదీ మౌనం భారతదేశ సార్వభౌమత్వాన్ని ప్రశ్నార్థకం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వామపక్ష నాయకులు తొండ రమణయ్య, బాలు, భాస్కర్, చంద్ర, బాబు, నాగరాజు, పొలెయ్య, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

మినీ గురుకులంలో సామూహిక జన్మదిన వేడుకలు


జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న సేవా సమితి సభ్యులు

గూడూరురూరల్ : పట్టణ సమీపంలోని గాంధీనగర్‌లో ఉన్న ఎస్టీ బాలికల మినీ గురుకులంలో శ్రీకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం 13 మంది విద్యార్థినులకు సామూహిక జన్మదిన వేడుకలు నిర్వహించారు. అనంతరం ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉపాధ్యాయినులకు క్రీడాపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాల్లోని కొన్ని కార్యాలయాలు, పాఠశాలల్లో వేడుకలు నిర్వహించారు. ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. - సాక్షి నెట్‌వర్క్


నాయుడుపేట : ఉత్తమ ఎంఈఓకు సత్కారం


నాయుడుపేట: ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం


ఓజిలి: ఉత్తమ ఉపాధ్యాయుడు హరికిశోర్‌కు సన్మానం


తడ: ఉత్తమ ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న సిబ్బంది


సూళ్లూరుపేట: ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం


దీవీ సత్రం: ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



దీవీ సత్రం: ఉత్తమ ఉపాధ్యాయుడికి సత్కారం, చిట్టమూరు : ఉపాధ్యాయులను సత్కరిస్తున్న అధికారులు